ప్రజాశక్తి

బుధవారం 28 ఆగస్టు 2024

29న ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 29న స్థానిక రైతు బజార్ వెనుక ఉన్న విశ్రాంత ప్రభుత్వ పింఛనుదారుల భవనంలో మన్యం జిల్లా పెన్షన్ దారుల సంఘం ఆధ్వర్యంలో వరుణ్ డెంటల్ వారు ఇహెచ్ఎస్ కార్డుపై ఉచిత మెగా దంత వైద్య శిబిరం ద్వారా ఉచిత వైద్యం అందించనున్నారు. ఈ వైద్యానికి ఆర్‌టిసి ఎంప్లాయీస్, ఎపిఇపిడిసిఎల్, జర్నలిస్టులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు అర్హులని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మన్యం జిల్లా రిటైర్డ్ పెన్షన్దారుల కార్యదర్శి డి.గణపతిరావు మంగళవారంనాడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బడిదేవరకొండ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని కోరి రెవెన్యూ పరిధిలోని బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం ఇచ్చినా అనుమతులు వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం బడిదేవరగా కొండపరిధి లోని పరిసర గ్రామాల్లో తవ్వకాల వల్ల జరిగే అనర్ధాలను వివరిస్తూ కె.ములగ నుంచి చేపట్టిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ బడిదేవరకొండను దళారుల కోసం ప్రభుత్వం గ్రానైట్ అనుమతులు ఇచ్చిందని విమర్శించారు. ఈ ప్రాంతంలో 8 పంచాయతీల రైతులు, గిరిజనులు దైవంగా కొలుస్తున్నారని, అటువంటి తల్లికి గ్రానైట్ అనుమతులిచ్చి తమ నమ్మకాన్ని వమ్ము చేయడమేనని అన్నారు. బడిదేవరకొండలో ప్రాంతంలో ప్రజలు పూజిస్తేనే మేఘాలు వచ్చి వర్షం పడుతుందని, లేదంటే ఉండదని తమ పూర్వీకుల నుంచి పూజించుకొని వస్తున్నారని అన్నారు. అటువంటి తమ దైవాన్ని కొల్లగొట్టడమంటే తమ నమ్మకాలకు ద్రోహం చేయడమేనని అన్నారు. ఈ ప్రాంతంలో వర్షం పడడం వల్ల గెడ్డలు, వాగుల ద్వారా పంట పొలాలకు నీరు చేరుకుంటేనే పంట పండుతుందని, లేకుంటే ఉండదని అన్నారు. అటువంటి దైవాన్ని తమ తల్లిని నాశనం చేస్తున్నారని ఈ చుట్టుపక్క ప్రజలంతా ఆందోళన చెందుతున్నారని అన్నారు. 2017లో టిడిపి ప్రభుత్వంలో ఉండేటప్పుడు గ్రానైట్ అనుమతులు ఇచ్చారని, అప్పుడు వ్యతిరేకంగా పోరాటం చేస్తే 12సార్లు రాష్ట్ర జిల్లా, మండల రెవెన్యూ, అటవీశాఖాధికారులు సర్వే చేశారని, అప్పట్లో రిజర్వు ఫారెస్ట్ అని తేలిందని, దీంతో గ్రానైట్ తవ్వకాలు ఆపేశారన్నారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం రాగానే గ్రానైట్ అనుమతులు ఇచ్చి మళ్లీ ప్రారంభిస్తున్నారని, దీనివల్ల ప్రజలకు చాలా నష్టదాయకమని అన్నారు. కావున తక్షణమే ప్రభుత్వం మైనింగ్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బైక్ ర్యాలీలో రైతు సంఘం ఉపాధ్యక్షులు బంటు దాసు, ములగ సర్పంచ్ మడక కృష్ణవేణి, టిడిపి నాయకులు బొబ్బిలి రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.రాము, గిరిజన సంఘం నాయకులు ఎం.రాము, కె.చిరంజీవి, కె.చంటి, టి.రాము తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ఇసుక తవ్వకాలకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

భామిని మండలం కాట్రగడ్డ వద్ద గల ఇసుక ర్యాంపులో అందుబాటులో గల ఇసుకను గురువారం నుంచి వెలికితీసేందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ ఇసుక తవ్వకం నీటిపారుదల శాఖ అధికారులు చేపట్టాలని, వాహనాలు రవాణాశాఖ అధికారులు చేపట్టాలని, సేకరించిన ఇసుకను స్టాకు పాయింటులో నిల్వచేయాలని తెలిపారు. ఇసుక సేకరించిన అనంతరం అమ్మకాలకు సంబంధించి ఇతర శాఖల అధికారులు వారికి అప్పగించిన పనులకు సిబ్బందిని వెంటనే కేటాయించి వారికి అవసరమైన శిక్షణ అందించాలని తెలిపారు. ఇసుక బుకింగు పాయింటు వద్ద ఇసుక అమ్మకాలను గూర్చి రేట్ల వివరాలతో బోర్డులను ఏర్పాటు చేయాలని, పోస్టర్లు అంటించాలని తెలిపారు. ఇసుక బుకింగు ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా చేసుకోవాలని, ప్రజలకు అవగాహన కోసం ప్రచారం చేయాలని తెలిపారు. ఇసుక అమ్మకాల్లో ప్రభుత్వం నిర్దేశించిన రుసుములు తప్ప ఎటువంటి అదనపు వసూల్లు చేయకూడదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కొమరాడ, సీతానగరం మండలాల్లో ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు, వార్తలు వస్తున్నాయని, అటువంటి వారిపై పోలీసు, రెవెన్యూ అధికారులు కలిసి తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ కె.హేమలతను ఆదేశించారు. సమావేశంలో జెసి ఎస్ఎస్ శోబిక, ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, పాలకొండ ఆర్‌డిఒ వివి రమణ, డిపిఒ బి.సత్యనారాయణ, వంశధార ఇఇ రామచంద్రరావు, డిటిఒ ఎం. శశికుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

1800 ఎకరాల్లో జీడి తోటల పునరుద్ధరణ

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 18 వందల ఎకరాల్లో జీడి తోటల పునరుద్ధరణ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. వివిధ శాఖలతో తన కార్యాలయంలో కలెక్టర్ మంగళ వారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన, సెరికల్చర్, సూక్ష్మ సేద్యం రంగాల్లో ప్రభుత్వ పరంగా రైతులకు ఉపయోగపడే మంచి పథకాలు ఉన్నాయన్నారు. వీటిని రైతులు వద్దకు తీసుకువెళ్లాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో తక్కువ ఫలసాయం వస్తున్న జీడి మామిడి తోటల పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. అవసరం మేరకు ఉపాధి హామీ పథకం అనుసంధానంతో రైతులకు మేలు జరిగే కార్యక్రమం చేపట్టాలని స్పష్టం చేశారు. పునరుద్ధరణ లో భాగంగా గుమ్మలక్ష్మీపురంలో 500 ఎకరాలు, కురుపాంలో 540, జియ్యమ్మవలసలో 200, కొమరాడలో 160, సాలూరులో 200, మక్కువలో 100, పార్వతీపురంలో వందెకరాల్లో జీడీ మామిడి పునరుద్ధరణ చేపట్టాలని ఆదేశించారు. పూర్తి వివరాలకు రైతులు దగ్గరలో ఉన్న ఉద్యాన, వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో పని వేళల్లో సంప్రదించవచ్చని, లేదా ఐటిడిఎ ఉద్యాన శాఖ ఎఇఒ సుబ్బ రాజు (9492745405) ను సంప్రదించాలని ఆయన సూచించారు.

అలాగే సెరీకల్చర్ రైతులు సిల్క్ సమగ్ర పథకాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. మలబరీ మొక్కల యూనిట్ ఖరీదు రూ.30 వేలు కాగా, సిల్క్ సమగ్ర పథకం కింద ఎస్.టి, ఎస్.సి రైతులకు 90 శాతం రాయితీ (రూ.27 వేలు), ఇతర వర్గాల రైతులకు 75 శాతం రాయితీ (రూ.22,500/-) వస్తుందని చెప్పారు. టైప్ -1, 2 రకాల పురుగుల పెంపకం షెడ్ (రేరింగ్ షెడ్) నిర్మాణాలకు రాయితీలు ఇస్తామన్నారు. మందులు కూడా రాయితీపై అందజేస్తామని కావున మలబరీ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో ఉద్యాన, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై తుంపర సేద్యం పరికరాలు సరఫరా

తక్కువ నీటివనరులతో వ్యవసాయం చేసేందుకు తుంపర సేద్యం పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పార్వతీపురం ఐటిడిఎ సబ్ ప్లాన్ మండలాల్లో గల రైతులకు తుంపర సేద్యం పరికాలు రాయితీ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఐటిడిఎ పరిధిలో 750 మందికి గానూ రూ.53.79 లక్షలు నిధులు విడుదలయ్యాయని తెలిపారు. ప్రతి రైతుకు ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ తరుపున చిన్న, సన్నకార రైతులకు(5 ఎకరాలు లోపు) 55శాతం రాయితీ, పెద్ద రైతులకు (5 ఎకరాలు నుండి 12.5 ఎకరాలు వరకు) 45శాతం రాయితీపై అందజేస్తున్నట్టు తెలిపారు. భూమి, బోర్ బావి, ఆయిల్ ఇంజెన్, సోలార్ పంప్ ఉన్న గిరిజన రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. కావున ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ పథకం పొందదల్చిన గిరిజన రైతులు మీ సమీప రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని, లేదా 7995009841 (కేశవ్, స్ప్రింకర్స్ ఇంజనీరు) నెంబరును సంప్రదించాలని తెలిపారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకొనేందుకు అవసరమైన పత్రాలు ఆధార్ కార్డు, 1 బి, రైతు బ్యాంకు అకౌంట్, రైతు గుర్తింపు కార్డు (ఆధార్ కాకుండా), రైతు ఫోన్ నెంబర్ అందజేయాలని తెలిపారు.

డిడి కార్యాలయాన్ని సీతంపేటలోనే కొనసాగాలి

ప్రజాశక్తి - సీతంపేట

ట్రైబల్ వెల్ఫేర్ డిడి కార్యాలయంలో సీతంపేటలో కొనసాగించాలని ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ మంగళవారం రాజపురంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఇంటి వద్ద వినతి పత్రం అందజేశారు. ట్రైబల్ వెల్ఫేర్ డిడి కార్యాలయాన్ని శ్రీకాకుళం హెడ్ క్వార్టర్‌కు బదిలీ చేయడం వల్ల ఇక్కడ ఉండే ఆదివాసీలకు చాలా నష్టం జరుగుతుందని తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ డిడి కార్యాలయం ఐఎఎస్ అధికారి ఉండే ఐటిడిఎ దగ్గరలోనే సీతంపేట కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివాసీ జెఎసి నాయకులు బి.రామ్మోహనరావు, హెచ్.ప్రసాదరావు, చంద్రరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జయకృష్ణకు వినతిని అందజేస్తున్న గిరిజన జెఎసి నాయకులు

సాలూరులో యుటిఎఫ్ స్వర్ణత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

స్వర్ణోత్సవ సభలు విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సాలూరు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభలు విజయవంతం చేయాలని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాజమణి, మండల నాయకులు జానకీరావు, సీతయ్య, గణేష్ కోరారు. సోమవారం వారు యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన 50ఏళ్లలో యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిందని చెప్పారు. భవిష్యత్‌లోనూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అవ్వా రమేష్, ఈశ్వరమ్మ, మీనా పాల్గొన్నారు.

సీతానగరం : అక్టోబర్ 20,21, తేదీల్లో జరుగు యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని యుటిఎఫ్ మండల నాయకత్వం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద గోడపత్రికను ఆవిష్కరించింది. పార్వతీపురంలో జరుగు ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల యుటిఎఫ్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లి శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు జిల్లా కౌన్సిల్ సభ్యులు మర్రాపు గోవిందరావు, మండల కార్యవర్గ సభ్యులు బూరాడ ఆదినారాయణ, ఆది వెన్నెల శంకరరావు, కునుకు మురళి, నాగులకొండ త్రినాధ్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల మరమ్మతులెప్పుడో?

రెండు నెలల క్రితమే మంత్రి ఆదేశాలు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. పట్టణంలోని సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులు రెండు వారాల్లో చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఆదేశించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొద్ది రోజుల్లోనే ఆమె మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు వారాల్లో మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. అయితే మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేయడానికి మున్సిపాలిటీలో నిధుల్లేవని అధికారులు చెప్పడంతో కలెక్టర్‌ను అడిగి నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. మరుగుదొడ్ల మరమ్మతు పనుల కోసం నిధులు కావాలని ఆమె అప్పటి కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కోరారు. అయితే నిధులు మంజూరు కాకముందే ఆయన బదిలీపై వెళ్లిపోయారు. ప్రస్తుత జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌ను మంత్రి సంధ్యారాణి నిధులు మంజూరు గురించి అడిగారా లేదా అన్నది స్పష్టత లేదు. పట్టణంలో 20 మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేయాల్సి ఉంది. మురికి వాడలకు సమీపంలో ఉన్న ఈ మరుగుదొడ్లు ఇప్పుడు నిరుపయోగంగా మారాయి. మరమ్మతు పనులకు సుమారు రూ.20లక్షలు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. మున్సిపాలిటీలో నిధులు లేని కారణంగా పనులు ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడింది.

పట్టణంలో శిథిలమైన మరుగుదొడ్డి

జ్వరాల వివరాలు అందించండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల జ్వరాల వివరాలు అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయ పార్వతి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో గల ప్రైవేట్ ఆసుపత్రుల్లో నమోదయ్యే సాధారణ జ్వరాలు, మలేరియా, డెంగీ, చికున్ గునియా, ఇతర జ్వరాల సమాచారం తక్షణమే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి తెలియపర్చాలని ఆమె స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాలు, అబార్షన్లు, కుక్క, పాము కాట్లుతో పాటుగా వస్తున్న అన్ని కేసుల వివరాలు అందజేయాలని పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సమాచారం కూడా అందించాలని, అందించని ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, లైసెన్స్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అన్ని ఆసుపత్రులు పి ఫారంను తప్పనిసరిగా ప్రతి రోజు సమర్పించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మలేరియా, డెంగీ, ఇతర జ్వరాలకు సరిపడా మందులున్నాయని, జ్వరాల పరిస్థితి అదుపులోనే ఉందని, డెంగీ నిర్ధారణ చేయడానికి పార్వతీపురం జిల్లా ఆసుపత్రి, పాలకొండ ఏరియా ఆసుపత్రి సెంటినల్ సైట్ హాస్పిటల్స్‌గా గుర్తింపు పడ్డాయని, కేవలం ఈ రెండు ఆసుపత్రుల్లో మాత్రమే డెంగీ నిర్ధారిస్తామని తెలిపారు. ఈ మేరకు జిల్లాలో గల అన్ని ప్రైవేటు ఆసుపత్రులకు, ల్యాబ్ లకు సర్క్యులర్ జారీ చేశామని ఆమె అన్నారు.

నేడు నీలకంఠాపురంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠాపురం పంచాయతీ కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కార్యదర్శి బి.శంకర్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ బి. ప్రదీప్ తెలిపారు

మృతుల ఖాతాల్లో పింఛను డబ్బులు జమ

సామాజిక తనిఖీలో బయటపడ్డ అక్రమాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మేజర్ పంచాయతీ వీరఘట్టం పరిధిలో ఏడుగురు పింఛనుదారులు మృతి చెందినప్పటికీ వారి బ్యాంకు ఖాతాలోకి నగదు జమైనట్లు సామాజిక తనిఖీ బృందం బట్టబయలు చేసింది. మంగళవారం మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ గ్రామసభలో వినిపించారు. మత్స్యకారుడైన జొన్నాడ శంకర్రావు ఈ ఏడాది ఏప్రిల్ 13న మృతి చెందితే మే, జూన్ నెలలకు సంబంధించి రూ.6వేలు ఆయన బ్యాంక్ ఖాతాలో జమైంది. వితంతువు బండి సుశీల ఈ ఏడాది మార్చి 17న మృతి చెందగా, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి పింఛను బ్యాంకు ఖాతాలోకి జమైంది. అలాగే చోడవరపు నారాయణమ్మ, బోనెల దేశయ్య, ఏకల అప్పమ్మ, బండి గౌరమ్మ, కోడి లలితమ్మ మృతి చెందగా, వీరి బ్యాంకు ఖాతాకు పింఛన్లు జమైనట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. అదేవిధంగా మృతి చెందిన 51 మంది పేర్లు పింఛను జాబితా నుంచి తొలగించలేదని, 13 మంది మత్స్యకారులు ఉన్నప్పటికీ వారికి ఏ విధమైన గుర్తింపు కార్డులు లేవని, ఇద్దరు చర్మకారులకు సంబంధించి గుర్తింపు కార్డుల్లేవని, ఒక కల్లుగీత, ముగ్గురు వంటరి మహిళలకు, వితంతు ఒకరికి గుర్తింపు కార్డుల్లేవని గ్రామ సభలో వెల్లడించారు. అదేవిధంగా గ్రామంలో తనిఖీ చేసేందుకు వివరాలు అడిగినప్పటికీ కనీసం వీటికి సంబంధించిన జాబితాలు ఇవ్వకపోవడంతో పాటు సిబ్బంది కూడా సహకరించలేదని సామాజిక తనిఖీ బృందం అసహనం వ్యక్తం చేసింది. వీటిని బట్టి చూస్తే మేజర్ పంచాయతీలో అర్హులు కంటే అనర్హులకే పెద్ద చోటు కల్పించారని స్థానికుల నుంచి విమర్శల వెలువెత్తుతున్నాయి. అయితే ఈ తప్పు ఎవరిది మృతి చెందిన వారికి పింఛన్లు పంపిణీ చేశారంటే అధికారుల నిర్లక్ష్యమైన ఉండాలి, లేదా పాలకులు ఒత్తిడే ఉండే ఉంటుందని, ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చాల్సిన అధికారులే వీరు తప్పిదం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుందని గ్రామ సభకు వచ్చిన వారంత ముక్కున వేలేసుకుంటున్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.సత్యంనాయుడు, పట్టణ టిడిపి అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు బల్ల హరిబాబు, తూముల రమేష్, మాజీ ఎంపిటిసి బి.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో నివేదిక వినిపిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యుడు

కుప్పానాయుడు సేవలు ఆదర్శప్రాయం

ప్రజాశక్తి - సాలూరు

సిపిఎం నాయకులు ఆర్.కుప్పానాయుడు సేవలు ఆదర్శప్రాయమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు అన్నారు. కుప్పానాయుడు 12వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఎన్‌వైనాయుడు మాట్లాడుతూ చివరి వరకూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం పరితపించిన నాయకుడని అన్నారు. నిరాడంబర జీవితం గడిపి పేదలు, దళితులు, గిరిజనుల హక్కుల పోరాటం సాగించారని కొనియాడారు. గజపతినగరం కేంద్రంగా మెంటాడ, దత్తిరాజేరు, గజపతినగరం, సాలూరు ప్రాంతాల్లో రైతులు, కూలీల సమస్యల పరిష్కారానికి పోరాడారని చెప్పారు. పోడుభూములకు పట్టాలు ఇప్పించడానికి ఆయన అవిశ్రాంత పోరాటం చేశారని చెప్పారు. నేటి తరం నాయకులు కుప్పానాయుడును ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు రాముడు, ఇతరులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండల కేంద్రంలో కుప్పానాయుడు వర్ధంతి సభ జరిగింది. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బోను గౌరునాయుడు, కార్మిక సంఘాల నాయకులు జె.వెంకటరమణ కుప్పా నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ ఆర్ కుప్పా నాయుడు ఉన్నత చదువులు చదివి పీడిత ప్రజలు, కార్మికులు, రైతుల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. అటువంటి నాయకుడు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు కె.తిరుపతిరావు, కె శ్రీనివాస్, చెన్నారావు రైతు సంఘం నాయకులు జె.రామారావు తదితరులు పాల్గొన్నారు

సాలూరులో కుప్పానాయుడుకు నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

చేపల చెరువులకు లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలో చేపల చెరువులకు లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని మత్స్యశాఖ జిల్లా అధికారి పి.తిరుపతయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేపల చెరువులు తీసుకునే వ్యాపారస్తులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ 2020 ప్రకారం లైసెన్స్‌లు మంజూరు జరుగుతుందని చెప్పారు. ఇ-మత్స్యకార్ లాగిన్‌లో గ్రామ మత్స్యశాఖ అసిస్టెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని ఆయన తెలిపారు. దరఖాస్తుతో పాటు ఎకరానికి వెయ్యి రూపాయల చొప్పున చెల్లించాలని, మండల సర్వేయర్ జారీ చేసిన ఆటోక్యాడ్ మ్యాపు, భూమి రెవెన్యూ అడంగల్, పట్టాదారు పాసుబుక్ లేదా లీజ్ అగ్రిమెంటు, పది రూపాయల బాండ్ పేపర్‌పై 80 శాతం నిఖర చెరువు, 20శాతం గట్లు వేస్తానని హామీ ఇస్తూ అఫిడవిట్ ఉండాలని వివరించారు. అర్హత గల దరఖాస్తులకు జిల్లా, మండల స్థాయి కమిటీల ద్వారా లైసెన్స్‌లు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

నిరసన తెలుపుతున్న మహిళలు

చెత్తను తొలగించాలంటూ నిరసన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న చెత్తను తొలగించాలని పట్టణ పౌరుల ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో స్థానికులు మంగళవారం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం కన్వీనరు దావాల రమణారావు మాట్లాడుతూ పట్టణంలో గృహాలు, మార్కెట్ జనసంచారమున్న ప్రాంతాల్లో చెత్తను డంపింగ్ చేయడం సరైనా పద్ధతి కాదన్నారు. నగర పంచాయతీ కార్యాలయ ప్రాంతమంతా చక్కటి వాతావరణం కల్పించాల్సినప్పటికీ పట్టణంలోని సేకరించిన చెత్తను కార్యాల యం ఎదురుగా డంప్ చేయడంతో అక్కడు న్న గ్రంథాలయంతో పాటు, మార్కెట్‌కు వచ్చిన వారు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ దుర్వాసన భరించలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే చెత్తను తొలగించాలని, లేనిపక్షంలో ప్రజాఉద్యమం తీవ్రతరం చేస్తా మని హెచ్చరించారు. అనంతరం మేనేజర్ జయరాంకు వినతి పత్రాన్ని అందించారు. ఇక్కడ చెత్త వేస్తే స్థానికులతో కలిసి అడ్డుకుంటామని, దీనికి పరిష్కారం చూపించాలని రమణారావు మేనేజర్‌ను కోరారు. వినతి పత్రం అందించిన వారిలో జగదీశ్, ఎచ్చెర్ల సతీష్, లలిత, భాను, రాజశేఖర్, శ్రీనివాసరావు తదితరులున్నారు.

గ్రామస్థాయి సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గ్రామాలను అభివృద్ధి బాట పట్టించేందుకు గ్రామ స్థాయి సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎంపిడిఒలను ఆదేశించారు. తన కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లో ఎంపిడిఒల పాత్ర కీలకమన్నారు. ఉపాధి హామీ చట్టం కింద వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేసి అభివృద్ధి పనులు చేయడంలో సరైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని స్పష్టం చేశారు. సానుకూల దృక్పథంతో పని చేయాలని ఆదేశించారు. లక్ష్య సాధన దిశగా పనితీరు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మండలాల్లో సమగ్రమైన డేటా తయారు చేయాలని సూచించారు. ఆరోగ్యం మెరుగుపర్చడం, పౌష్టిక ఆహారాన్ని అందివ్వడం, సురక్షిత తాగు నీరందించడం వంటి అంశాలు కూడా అభివృద్ధిలో భాగమని పేర్కొన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది సేవలు సంతృప్తికర స్థాయిలో ఉపయోగించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అక్రమ ఇసుక తవ్వకాలు ఎక్కడా జరగరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎంపిడిఒలు కూడా పర్యవేక్షించాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, మౌలిక వసతులు ఉన్న ప్రదేశాల వద్ద నిర్దేశిత నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరగరాదన్నారు. సెప్టెంబరు 15 నాటికి వర్మీ కంపోస్టు కేంద్రాల నుంచి ఉత్పాదకత ఉండాలని ఆదేశించారు. దోమలు, వ్యాధులు వ్యాప్తి కాకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, సరైన పర్యవేక్షణ చేయాలని ఆయన అన్నారు. మున్సిపల్ కమిషనర్లు అవగాహన కల్పించి, కమిటీలు నియమించాలని అన్నారు.

జన్ మాన్ అవగాహన కల్పించాలి

ప్రధాన మంత్రి జన్ మాన్ కార్యక్రమం కింద ఆదివాసీ గిరిజనుల (పివిటిజి) సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయాలని కలెక్టర్ సూచించారు. పివిటిజిలకు పూర్తి స్థాయిలో పక్కా గృహాలు ఉండాలని, విద్య, వైద్య, తాగు నీరు, మౌలిక వసతులు విధిగా ఉండాలని ఆయన అన్నారు. ఆయా గ్రామాల్లో అవసరాలను గుర్తించాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి జన్ మాన్ కార్యక్రమంపై పెద్ద ఎత్తున అవగాహన నిర్వహించాలన్నారు. ప్రతి సభ ఫలవంతం కావాలని చెప్పారు. గ్రామస్తుల అవసరాలు గుర్తించాలని ఆయన సూచించారు. సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు, ఆరోగ్య కార్డులు జారీ తదితర ప్రయోజనాలు ప్రతి అర్హుడికి అందాలని ఆయన ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో పాలకొండ ఆర్‌డిఒ వి.వెంకట రమణ, ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, పార్వతీపురం, పాలకొండ మున్సిపల్ కమిషనర్లు కె శ్రీనివాస్, ఎస్ సర్వేశ్వర రావు, మలేరియా నివారణ కార్యక్రమం కన్సల్టెంట్ రామచంద్ర, పలువురు ఎంపిడిఒలు పాల్గొన్నారు.

పైపు లీకై రహదారిపైకి వస్తున్న నీరు

పైపుల లీకు... తాగు నీరు వృథా

ప్రజాశక్తి - సాలూరురూరల్

సాలూరు - దండిగాం రోడ్డులో గల మామిడిపల్లి వద్ద మంచినీటి సరఫరా కోసం మెయిన్ రోడ్డు మధ్యలో గతంలో పైపులు వేశారు. ఈ రోడ్డు మీదుగా బస్సులతో పాటు లారీలు కూడా రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఇటీవల కాలంలో రామభద్రపురం నుంచి పార్వతీపురం వేళ్లే పారాది, సీతానగరం వంతెనలు పాడవ్వడంతో సాలూరు నుంచి మామిడిపల్లి మీదుగా పార్వతీపురం వెళ్లేందుకు ఈ రహదారి గుండా భారీ వాహనాలు, బసులు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోడ్డు కింద ఉన్న మంచినీటి సరఫరా కోసం వేసిన పైపులు పగిలి ఎక్కడిక్కడ లీకులవ్వడంతో రోడ్ల మీదకు నీరు వస్తుంది. ఈ నీటి వృథాతో గ్రామంలో చాలా వీధులకు నీటి సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ లీకులు అరికట్టి, రోడ్లపై ఏర్పడ్డ గుంతలను పూడ్చి తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

'ముత్యాన్ని' కోల్పోయిన సాహితీ రంగం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ప్రముఖ సాహితీవేత్త, చరిత్ర పరిశోధకులు, సాహితీ పరిశోధకులు, ప్రజా పక్షపాతి, ప్రజల కోసమే తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు ఆచార్య డాక్టర్ ముత్యం అకాల మరణం యావత్ సాహితీ రంగానికి తీరని లోటని నాటిక పరిషత్ అధ్యక్షులు రౌతు వాసుదేవరావు అన్నారు. మంగళవారం పెదమేరంగి కూడలిలో నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఆయన సంస్మరణ సభను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ సభలో పరిషత్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, కార్యదర్శులు అజయ్ కుమార్, దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు బలగ వెంకటరమణ, వెలగాడ అన్నపూర్ణమ్మ, బి.లలితారాణి, రాజేంద్ర, కవిరాజు, సతీష్ తదితరులు పాల్గొని ముత్యంతో వారికున్న అనుబంధాన్ని, ఆనాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు.

ఆర్‌డిసి డిపో మేనేజర్‌కు సమస్యలు వివరిస్తున్న టిడిపి నాయకులు

రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలి : ఎంపిపి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, కావున రవాణా సౌకర్యాలు మెరుగుపర్చాలని ఎంపిపి బొంగు సురేష్ మంగళవారం పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కనకదుర్గను కోరారు. ముఖ్యంగా కుదమ, గెడ్డతిరువాడ, పెదబుడ్డిడి శిఖబడి, టికె జమ్మూ తదితర గ్రామాల్లో ప్రజలకు, విద్యార్థులకు అవసరమైన సమయాల్లో అదనపు బస్సు సర్వీసులను కల్పించాలని కోరారు. డిఎంను కలిసిన వారిలో టిడిపి నాయకులు డొంకాడ రామకృష్ణ, దత్తి లక్ష్మణరావు, దాసరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక పాత బస్టాండ్‌లో అంబేద్కర్ జంక్షన్ జంక్షన్ వద్ద గల సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జనసేన పట్టణ అధ్యక్షులు సిరిపిల్లి అచ్యుతరావు అధికారులను కోరారు. మంగళవారం మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ గ్రామ సభ కార్యక్రమంలో మాట్లాడారు. వివిధ ప్రాంతాల్లో ఈ సదుపాయము ఉన్నప్పటికీ ఇక్కడ ఈ సదుపాయం లేక వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని ఆయన అన్నారు. వీటిని నిర్మించడం వల్ల రెండు మూడు కుటుంబాలకు జీవనోపాధి కలుగుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకొని గ్రామాభివృద్ధికి కృషి చేస్తారని కోరారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మదర్ తెరిసా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ బి.ప్రసాదరావు మాట్లాడుతూ మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకొని నడవాలని విద్యార్థులకు సూచించారు. అంతకుముందు మదర్ థెరిసా చిత్రపటానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పశువులు, పందులు తిరగరాదు

ప్రజాశక్తి -పాలకొండ

పట్టణంలోని ప్రధాన కూడలిలో పందులు, ఆవులు సంచరికుండా యాజమానులు తగు చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ సరేశ్వరరావు సూచించారు. మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పురపాలక శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పందులు పట్టణానికి 5 కిలో మీటర్లు దూరంలో ఉంచాలని, ఆవులను ఆయా పశువుశాలలో ఉంచే బాధ్యత సంబంధిత రైతులదని చెప్పారు. సెప్టెంబర్ 10 తేదీ వరకు గడవు ఇస్తున్నామని, అనంతరం నగర పంచాయతీలో ఎక్కడ ప్రధాన కూడలిలో పశువులు, పందులు కనిపించిన వాటిని స్వాధీనం చేసుకుని, ఊరికి దూరంగా విడిచిపెతమన్నారు. ఈ విషయాన్ని పెంపకం దారులు గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రన్నింగ్ పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 3, 2 కిలోమీటర్లు రన్నింగ్ పోటీలకు పాలకొండ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థిని, విద్యార్థులకు ఆహ్వానిస్తున్నట్టు ఐటిడిఎ పిఒ వివి రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న ఉదయం 6 గంటలకు స్థానిక ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో పోటీ నిర్వహించబడతాయన్నారు. ఈ పోటీలకు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లోని పదో తరగతిలోపు విద్యార్థులు అర్హులని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల అనంతరం ఐటిడిఎ మీటింగ్ హాల్లో జాతీయ క్రీడా దినోత్సవం కార్యక్రమం నిర్వహించబడునని తెలిపారు. కావున ఆసక్తి కలిగిన వారు ఈనెల 29న ఉదయం 6 గంటలకు ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంకు హాజరుకావాలని పిఒ తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఉపాధ్యాయులు సమయపాలన పాటించక, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని ఎ టి డబ్ల్యూఒ కె.చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జియ్యమ్మవలస పంచాయతీ బొడ్డవలసలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఏకోపాధ్యాయునిగా పనిచేస్తున్న అంకలాపు భాస్కర రాయుడు తమ విధులను సక్రమంగా నిర్వహించడం లేదని ఆయన మండిపడ్డారు. అనంతరం స్టాక్ రికార్డులను, హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే జియ్యమ్మవలస, వనజ గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలను సందర్శించి మెనూ అమలు, స్టాకు, విద్యార్థుల సంఖ్య, విద్యా బోధన తదితరాంశాలపై ఆరా తీశారు. అనంతరం వనిజ ఆశ్రమ పాఠశాలలో గణితం, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ఎ.రవి ప్రసాద్, ధనుంజయ మాస్టారు తెలపగా అందుకు స్పందించిన ఆయన ఈ విషయాన్ని తక్షణమే డిడి దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే రెండు పోస్టులను భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దిగువ మెండంగి వద్ద వంతెన నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని తోణాంలో గల దిగువ మెండంగి వద్ద వంతెన నిర్మించాలని సిపిఎం నాయకులు మర్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన గోముఖి నదిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోముఖి నదిపై వంతెన నిర్మించకపోవడం వల్ల తోణాం, గిరి శిఖర గ్రామాలైన పగులు చెన్నారు, పట్టుచెన్నారు పంచాయితీలో సుమారు 18 గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొండల మీద చిన్నపాటి వర్షం కురిసినా గోముఖీ నదికి వరదలు రావడంతో గిరిజనులు నిత్యవసర వస్తువులు, విద్య, వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. అనేక సందర్భాల్లో వర్షాల వల్ల ఉన్న కాజువే కొట్టుకుపోయిందని తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాంతం ప్రకృతి అందాలకు నిలయమని, శిఖపరువు ప్రాంతంలో జలపాతం ఉందని, నిరంతరం ఈ ప్రాంతానికి సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఎప్పటి నుండో ఇక్కడ ప్రజలు ప్రభుత్వాలకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోతుందని అన్నారు. ఈ ప్రాంతంలో పర్యాటకులకు వసతి సౌకర్యాలు కల్పించినట్లయితే ఈ ప్రాంతం చాలా అభివృద్ధి చెందుతుందని అన్నారు. పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తే స్థానికంగా ఉన్న గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న చాలా కొండలను మైనింగ్‌కు లీజులు పేరుతో బడా పారిశ్రామిక వేత్తలకు అప్పనంగా దోచుపెడుతున్నారని కానీ దీని వల్ల వారు లాభపడుతున్నారని అన్నారు. స్థానిక గిరిజనులకు ఉపాధి, జీవనోపాధి కల్పించడం లేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనులకు కనీస అవసరాలైన రోడ్లు, వంతెన, మంచినీళ్లు వంటి మౌలిక సదుపాయాలు అందడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ఈ ప్రాంతంపై దృష్టి పెట్టి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. తక్షణం గోముఖి నదిపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వంతల సుందరరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు అయోధ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జన్ని ఈశ్వరరావు పాల్గొన్నారు.

గోముఖి నదిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఆటో బోల్తా : పలువురికి గాయాలు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో అధ్వానంగా మారిన అంతరాష్ట్ర రహదారిపై వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతూ ఆసుపత్రి పాలవుతున్నారు. మంగళవారం చోళ్లపదం సమీపంలో గల అంతర్ రాష్ట్ర రహదారిపై ఉన్న గోతులు వద్ద ఆటో బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. విశాఖపట్నం నుంచి ఒడిస్సా వైపు బోర్డులు తీసుకెళ్తున్న ఆటోలో మండలానికి చెందిన పలువురు మహిళలు కూనేరు బ్యాంక్ వెళ్లేందుకు కొమరాడలో ఆటో ఎక్కారు. చోళ్లపదం సమీపాన గల భారీ గోతులు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న పలువురు మహిళలతో పాటు ఆటోలో సామాగ్రి తీసుకు వెళ్తున్న యాజమాన్యం కూడా కాలికి గాయమైంది. విషయం తెలుసుకున్న స్థానికులు సంఘటన స్థలానికి చేరుకొని బోల్తాపడిన ఆటోను లేపి పక్కకు నెట్టారు. ప్రయాణికులకు ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో ఆటోలో ఆరుగురు ప్రయాణికులు ఉండగా ఇద్దరికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కుమ్మరిగుంటకు చెందిన గౌరమ్మ, విశాఖపట్నం చెందిన యజమానికి స్వల్ప గాయాలు అయ్యాయి. అనంతరం గాయలైన పలువుర్ని ఆసుపత్రికి పంపించారు.

తప్పిన పెను ప్రమాదం
అధ్వాన రహదారులే కారణం

రహదారిపై బోల్తాపడిన ఆటో

మండలంలోని పలు ప్రాంతాల్లో అధ్వానంగా మారిన గోతుల వద్ద వాహనాలు బోల్తాపడడంతో ప్రమాదాల జరుగుతున్నాయని తక్షణమే అధికారులు ప్రభుత్వం స్పందించి రోడ్డుల మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ప్రాణాలకు భరోసా కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పొలంలోకి నీరు వెళ్లకుండా అడ్డుకట్ట

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని చెముడు పంచాయతీ పరిధిలోని పాటి పొలంలోకి వి ఆర్ఎస్ కుడి ప్రధాన కాలువ నుంచి నీరు దొర్లకుండా అధికారులు అడ్డుకట్ట వేశారు. 'ప్రజాశక్తి'లో ఈనెల 24న ప్రచురితమైన నీట మునుగుతున్న పంట పొలాలు అన్న వార్తకు విఆర్ఎస్ అధికారులు స్పందించారు. దీంతో రెండు రోజులుగా కాలువ నీరు దొర్లే ప్రాంతంలో గ్రావెల్ వేసి గట్టు ఎత్తును పెంచుతున్నారు. దీనిపై స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అలాగే తూము ఎత్తును కూడా తగ్గించినట్లయితే ఏ విధమైన నష్టం పంటలకు వాటిల్లదని రైతులు చెబుతున్నారు

కాలువ గట్టును ఎత్తు చేయిస్తున్న ఎఇ

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

ప్రజాశక్తి - సీతానగరం

మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్ఐం ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ వద్ద వాహనదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. మైనర్ బాలికలకు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని ఎర్రన్న గుడి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ నాయుడు రహదారి నియమ, నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. అలాగే మైనార్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. తల్లిదండ్రులు బాధలు పడవలసి వస్తాదని తెలిపారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకు వెళ్లడం నేరమన్నారు. రహదారి భద్రత నియమ, నిబంధనలు కఠినంగా అమలు చేస్తామని, అతిక్రమించిన వారిపై అపరాధ రుసుం, చలానాలు విధిస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహన దారులు ఏకాగ్రతతో వాహనాలను నడపాలని కోరారు. డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు రహదారి భద్రత నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి : వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - సీతంపేట

మండలం 1లోని కీసరజోడు పంచాయతీలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సున్నపురం రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి పి.శ్రీదేవి మాట్లాడుతూ పత్తిలో రక్షక పంటగా బంతి వేయడానికి బంతి మొక్కలు అందజేశామన్నారు. ద్రవ జీవామృతం తయారీ, కంది పంటలను పరిశీలించి సస్య రక్షణా చర్యలు, సూచనలు, సలహాలు ఇచ్చారు. తెగుళ్ల వచ్చినప్పుడు రైతులు నివారణా చర్యలు ఏ విధంగా చేపట్టాలా అన్న అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసా య శాఖ సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

శివరాంపురంలో...

సాలూరురూరల్ : మండల వ్యవసాయ శాఖా ఆధ్వర్యంలో శివరాంపురం లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎడిఎ భారతి గ్రామంలో పంటలను పరిశీలించి, సాగు విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. కరిబుగత అప్పల స్వామి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన ఆమె వవంటలో కాండం తొలుచు పురుగు, ఆకుముడత అక్కడక్కడ ఉన్నట్లు గుర్తించారు. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ స్ప్రే చేసుకోవాలని తెలిపారు. వరిలో అధిక దిగుబడులకు గానూ రైతులు నూతన విధానాలను అవలంభిస్తూ అధిక ఆదాయాన్ని పొందాలన్నారు. మండల వ్యవసాయ అధికారి అనూరాధ పండా మాట్లాడుతూ మండలం మొత్తమ్మీద ఈ గ్రామంలో ఆవులు ఎక్కువుగా ఉన్నందున రైతులంతా సేంద్రియ వ్యవసాయం చేస్తే బాగుంటుందని, దీని ద్వారా నాణ్యమైన దిగుబడితో పాటు, ఆరోగ్యకరమైన పంటలు పండి, భూమి కూడా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. దీని ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది కషాయాలు తయారీ విధానం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.మోహన్, వివిఎ వెంకటేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీరఘట్టం : సాగులో మెలకువ లు పాటిస్తే అధిక దిగుబడులు సాధించ వచ్చునని పాలకొండ ఎడిఎ కె.రత్నకుమారి రైతులకు సూచించారు. మండలంలోని కె.ఇచ్ఛాపురంలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంటలు సాగు చేయడమే కాకుండా వాటిపై అవగాహన కూడా ఉండాలన్నారు. అప్పుడే శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుందన్నారు. అనంతరం సేంద్రీయ తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈనెల 29న రాగోలు ఎఆర్ఎస్‌లో నిర్వహించనున్న వ్యవసాయ యాంత్రీకరణ ఎగ్జిబిషన్ లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.గౌర్నాయుడు, ఎఆర్ఎస్ శాస్త్రవేత్త లక్ష్మీ నారాయణ, ఎఒ జె.సౌజన్య, విఎఎలు, పశు వైద్య శాఖ, విహెచ్ఎ ఎపి సిఎన్ఎఫ్ మండల యాంకర్ ఎం.సింహాచలం పాల్గొన్నారు.

పాచిపెంట : విచక్షణా రహితంగా ఎరువులు, పురుగుల మందులు, కలుపు మందులు వాడడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా సాగు వ్యయం విపరీతంగా పెరగడమే కాకుండా పర్యావరణానికి నష్టం కలిగి అవాంచిత పురుగులు తెగుళ్ల ఉధృతి పెరగడమే కాకుండా పంటల నాణ్యత దెబ్బ తింటుందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. సాగు ఖర్చులు తగ్గించి దిగుబడి పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సేవలను రైతు వద్దకు తీసుకుపోవడానికి నిర్దేశించిన ప్రత్యేక కార్యక్రమమే పొలం పిలుస్తోందని తెలిపారు. మండలంలోని మాతుమూరు, కేసలి పంచాయతీల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా రైతు క్షేత్రాల్లో ఉన్న సాగు సమస్యలను గుర్తించి సమావేశం నిర్వహించుకొని వాటి పరిష్కారానికి చర్చించి సరైన నిర్ణయాలు తీసుకునే దిశగా రైతులు సమాయత్తపర్చడానికి కార్యక్రమం ఉపకరిస్తుందని రైతులు తెలిపారు. అనంతరం వ్యవసాయాధికారి మాట్లాడుతూ పత్తిలో జింకు, బోరాన్, మెగ్నీషియం లోపాలను సవరించుకుంటే దిగుబడులు పెరుగుతాయని, ఏకపంట విధానాన్ని విడనాడి బహుళ పంటలపై దృష్టి సారిస్తే అదనపు ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. అనంతరం పత్తి, మొక్కజొన్న, వరి పంట క్షేత్రాలను రైతులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో విఎఎ దినేష్ కుమార్, రాకేష్ కుమార్, ఎంపిటిసి ప్రతినిధి ఎం.అప్పారావు, ప్రకృతి సేద్య ప్రతినిధులు తిరుపతినాయుడు, శ్రీనివాస్, సూర్యారావు పాల్గొన్నారు.

నాగావళి నదివద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఎన్నాళ్లీ కష్టాలు..?

ఇప్పటికైనా వంతెన పనులు ప్రారంభించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

జిల్లాలోని నాగావళి నది అవతల వైపు ఉన్న ప్రజలు రాకపోకలు చేసేందుకు ఇంకా ఎన్నాళ్లు ఈ కష్టాలు.. ఎన్నేళ్లీ ఈ నరకయాతన పడాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పూర్ణపాడు - లాబేసు వంతెన వద్ద పెండింగ్ పనులు పరిశీలించిన అనంతరం మర బోటు పైన లాబేసు గ్రామస్తులతో నాగావళి నదిలో ప్రయాణిస్తునఆన విద్యార్థులు, గ్రామస్తులు కలిసిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 31 పంచాయతీలు ఉండగా 9 పంచాయతీల గ్రామాలకు చెందిన 60 గిరిజన గ్రామాలకు ఎంతో ఉపయోగకరమైన ఈ వంతెన 2006లో పనులు ప్రారంభించి నేటికి 18ఏళ్లయినా వంతెన పూర్తి చేయకపోవడం చూస్తే అటు పాలకులకు, ఇటు అధికారులకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మూడు ప్రభుత్వాలు మారినా కేవలం 40 శాతం పనులు పూర్తికాకపోవడం దారుణమన్నారు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వం వంతెన పెండింగ్ పనులు పూర్తి చేస్తామని ఇటీవల ముఖ్యమంత్రి హామీఇచ్చారని, తక్షణమే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, లాబాసు గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు ఉద్యోగాలివ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఏకలవ్య పాఠశాలల్లో గత ఐదేళ్లుగా పనిచేస్తూ ఉద్యోగాలు కోల్పోయిన గిరిజన యువతకు తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన విద్యార్థి సంఘం, మైదాన ప్రాంత గిరిజన నిరుద్యోగ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, పల్ల సురేష్, రఘుపతుల శశి భూషణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యా సంస్థల్లో అడ్డగోలుగా గిరిజనేతరులకు ఉద్యోగాలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు అన్యాయం చేయడం తగదన్నారు. తక్షణమే ఏకలవ్యలో ఉద్యోగాలు కోల్పోయిన గిరిజన యువతకు తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగం కోల్పోయిన గిరిజన యువతి పువ్వల లావణ్య, గిరిజన నిరుద్యోగ యువత చెల్లూరి సీతారాం, పువ్వల విజయ్, తాడంగి రమేష్, పువ్వల సునీల్, మండంగి మురళి, ఆరిక చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కంటి సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

కంటి ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి అన్నారు. నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్యాలస్ రోడ్డు వరకు వైద్య సిబ్బందితో కలిసి నేత్రదాన పక్షోత్సవాలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలు జరుగుతున్నాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చిత్రం బహూకరణ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దేవరపేటకు చెందిన చిత్రకారుడు ఎం.యుగంధర్ డిప్యూటీ సిఎం పవన్‌కు ఎమ్మెల్యే జయకృష్ణ పుష్పగుచ్ఛం అందించిన చిత్రాన్ని గీసి, ఆ పటాన్ని మంగళవారం బహూకరించారు. దీనికి ఎమ్మెల్యే యుగంధర్‌ను అభినందించారు. ఇలాంటి చిత్రకారులు మరింత మంది ముందుకు రావాలని కోరారు. ఈయనతో పాటు యుగంధర్ తండ్రి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు జవరాజు ఉన్నారు.

CHANGE OF NAME

I, MOHAMMED SHAKIRA W/o MOHAMMAD SAYEED residing at D.No.53-1-75, Chinaharijana Peta, Salur. I have has changed my name **as MOHAMMAD SHAKIRA** (New Name) here after my name known as **MOHAMMAD SHAKIRA.**